పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్

- పాలిసెట్, ఏపీఆర్‌జేసీకి 260 మంది హాజరు
- 14 ఏళ్లుగా ఉచిత కోచింగ్ అందిస్తున్న ఉపాధ్యాయ బృందం


ఉచిత కోచింగ్ అందిస్తున్న ఉపాధ్యాయుడు

పులివెందుల టౌన్ : పేద విద్యార్థుల పాలిట ఒక వరంలా ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం నిలుస్తోంది. ప్రతి ఏడాది పదోతరగతి అనంతరం పాలిసెట్, ఏపీఆర్‌జేసీల్లో కోచింగ్ తీసుకొనే గ్రామీణ, పట్టణ పేద విద్యార్థులకు మేమున్నాము అంటూ భరోసా ఇస్తూ సెలవుల్లో కూడా తమ కుటుంబంతో సరదాగా గడపాలని ఆనుకోకుండా పేద విద్యార్థుల భవిష్యత్ కోసం ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం కష్టపడుతూ విద్యార్థులకు పాలిసెట్, ఏపీఆర్‌జేసీ కోచింగ్‌లో మంచి ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. గత 14 ఏళ్లుగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో పాత సత్రం బడి పాఠశాలలో ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం నలుగురితో మొదలై ఇప్పుడు 37 మంది ఉపాధ్యాయులు ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు ఇక్కడ సిద్ధంగా ఉన్నారు. మన జిల్లానుంచే కాకుండా రాయలసీమలోని జిల్లాలనుంచి కూడా విద్యార్థులు ఇక్కడ కోచింగ్ తీసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 260 మంది పేద విద్యార్థులు ఉచిత కోచింగ్ తీసుకుంటున్నారు.



ర్యాంకు తప్పకుండా సాధిస్తా : ఏపీఆర్‌జేసీలో తప్పకుండా ర్యాంకు సాధిస్తాను. ఎందుకంటే ఇక్కడ ఉచిత కోచింగ్ ఎంతో బాగా ఇస్తున్నారు. డబ్బు పెట్టినా ఇంతబాగా అర్థమయ్యేలా చెప్పరేమో అనిపిస్తుంది. పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. – చందన(విద్యార్థిని), నూలివీడు, అన్నమయ్యజిల్లా



ఇంజనీరింగ్ చేయాలని ఉంది : పాలిటెక్నిక్‌లో ట్రిపుల్‌ఈ చేసి మంచి ఇంజనీర్ కావాలని ఉంది. మా అమ్మనాన్నల ఆశలను తప్పకుండా నెరవేరుస్తాను. ఇక్కడ కోచింగ్ బాగా ఇస్తున్నారు. తప్పకుండా సీటు సాధిస్తాను. – పద్మనాభరెడ్డి (విద్యార్థి), ఊడవగండ్ల, తొండూరు మండలం



పేద విద్యార్థుల కోసం : ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం ముందుకు వచ్చి సహకరించడం ఆనందంగా ఉంది. పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం ద్వారా వారికి మంచి సీట్లు సాధించి ఉన్నత స్థానంలో ఉంటే అది ఎంతో తృప్తినిస్తుంది. – రాజు(ఎస్‌ఏహెచ్‌ఎస్ అధ్యక్షుడు), పులివెందుల

క్లుప్తంగా

13న లోక్ అదాలత్

కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 13వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కమలాపురం మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం కోర్టు పరిధికి చెందిన సివిల్, క్రిమినల్, బ్యాంక్ కేసులు ఉండి రాజీ ధోరణిలో ఉన్న వారు ఈనెల 13న జరిగే లోక్ అదాలత్‌కు హాజరై తమ కేసులను పరిష్కరించుకో వచ్చని ఆమె తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెజిస్ట్రేట్ తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని వీరపునాయునిపల్లె సచివాలయ పరిధిలోని యరమలపల్లె, పోచంరెడ్డి గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోచంరెడ్డిపల్లెలో ఏపీఎండీసీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కమలాపురం నియోజకవర్గం ప్రత్యేక అధికారి చంద్రమోహన్ తెలిపారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇంటి నిర్మాణాలు ఎన్ని పూరైయ్యాయని అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, నీటి వసతి, విద్యుత్, తదితర విషయాలపై సమీక్షించారు. త్వరితగతిన పనులు చేపట్టి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగయ్య, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్‌టీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక

వీరపునాయునిపల్లె : మండలంలోని వెల్దుర్తి పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. ఎస్‌టీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా కేపీ వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం, చౌడయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలు అందరికీ ఆమోదయోగ్యంగా పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా ప్రమోషన్ పొందిన వారికి సత్వరమే న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యవర్గ ఎంపిక పరిశీలకుడు మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

తొండూరు : ప్రజలు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఇనగలూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు బీపీ, షుగర్, రక్తహీనత, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ, మలేరియా జ్వరాల బారినపడకుండా కాపాడుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి శిరీష, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మొలకల పౌర్ణమి ఉత్సవాలు

లింగాల : మండలంలో మొలకల పౌర్ణమి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. లింగాల, వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె, పెద్దకుడాల, బోనాల, అక్కులగారిపల్లె తదితర గ్రామాల్లోని మహిళలు భక్తిశ్రద్ధలతో మొలకల కుంపట్లు ఊరేగింపు నిర్వహించనున్నారు. వెలిదండ్ల గ్రామంలోని శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో శ్రీదేవిభూదేవి సమేత వరదరాజులస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రేపు బండలాగుడు పోటీలు, ఆర్కెస్ట్రా : శనివారం ఉదయం 8గంటల నుంచి నెల్లూరు జాతి సీనియర్ విభాగం వృషభరాజములచే బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ.80వేలు, రెండవ రూ.60వేలు, మూడవ రూ.40వేలు, నాల్గవ రూ.30వేలు, 5వ రూ.20 వేలు, 6వ రూ.15వేలు ఉంటుందన్నారు. రాత్రి 9గంటలకు అనంతరం జిల్లా ధర్మవరంకు చెందిన ఆర్‌ఆర్‌ఆర్ ఈవెంట్స్ వారిచే ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

6, 7న గంగమ్మ తిరునాల

మైదుకూరు : మండలంలోని శివపురం వద్ద వెలసిన గంగమ్మకు ఈనెల 6, 7 తేదీల్లో తిరునాలను జరుపనున్నట్టు సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో 6వ తేదీ ప్రత్యేక పూజలు, 7వ తేదీ సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీలు, మనుషులకు గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం


కొలువు దీరిన లక్ష్మీనరసింహస్వామి

వల్లూరు : మండల పరిధిలోని డి.కొత్తపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వామి వారి కల్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాన్ని నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం దిగువపల్లె, డి.కొత్తపల్లె, పెండ్లిమర్రి మండలంలోని ఎగువపల్లె గ్రామాలలో స్వామి వారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువకుల విన్యాసాల మధ్య గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజీల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 9963 170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

శేషవాహనంపై మోక్షనారాయణుడు


మాడ వీధుల్లో ఊరేగుతున్న మోక్షనారాయణుడు, సుబ్రమణ్యేశ్వర స్వామి వారు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణుడు శేషవాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోక్షనారాయణుడు శేష వాహనంపై, శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారు అశ్వ వాహనంపై ఊరేగించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సచివాలయ ఉద్యోగులకు డిక్లరేషన్ పత్రాల అందజేత


ఉద్యోగులకు డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్ పత్రాలను మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి గురువారం అందజేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, ఆర్‌ఓ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం


జగనన్నే మా భవిష్యత్ బ్రోచర్‌ను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : రాగిమానుపల్లె పంచాయతీ పరిధిలోని తుమ్మలపల్లె, రాయలాపురం గ్రామాల్లో గురువారం జేసీఎస్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు ప్రతి ఇంటికీ వెళుతూ టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మోసాన్ని ప్రజలకు వివరించడంతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు లబ్ధి పొందుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డిష్ వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాబురెడ్డి, రామాంజనేయులు, డైరెక్టర్ రామమల్లేశ్వరరెడ్డి, హరినాథరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓలు

లింగాల : మండలంలోని జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పక్కాగృహాల నిర్మాణ పనులను శుక్రవారం పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు పరిశీలించారు. పార్నపల్లె గ్రామంలో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. జూన్ చివరి నాటికి ప్రభుత్వ పక్కాగృహాల నిర్మాణ పనులను పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ శేషారెడ్డి, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'సమాచారం'పై పోలీసుల నిర్లక్ష్యం



సమాచార లోపంతో ముద్దనూరు పోలీసుస్టేషన్‌లో బోర్డు

ముద్దనూరు : సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సమాచార అధికారుల హోదా, పేర్లతో బోర్డును ఏర్పాటుచేయాలి. స్థానిక అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లోని బోర్డులో ప్రధానమైన పౌర సమాచార అధికారి పేరును పొందుపరచకుండా వదిలివేశారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విధుల్లో చేరి నెలరోజులు దాటినా ఆయన పేరును సమాచార హక్కు చట్టం బోర్డులో పొందుపరచడంలో నిర్లక్ష్యంగా వున్నారు.

వేధింపుల కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రవీంద్రనగర్‌లో నివాసం వుంటున్న మహమ్మద్ ఆలీ, సయ్యద్ భానుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు వున్నారు.భర్త, భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి


ఆదినిమ్మాయపల్లెలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల మన్ననలను వైఎస్సార్‌సీపీ పొందుతోందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదినిమ్మాయపల్లె, మిట్టపల్లె, పుష్పగిరి, కొత్తగాలివారిపల్లె తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి అనంతరం వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. మిట్టపల్లెలో పెన్నా నదిలోకి వెళ్ళడానికి దారిని ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పెన్నా నదిలోకి వెళ్లడానికి సైడ్ వాల్స్ తోపాటు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.9 లక్షల నిధులు మంజూరు చేయించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, హనుమంతురెడ్డి, నాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మస్తాన్, అంకిరెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, డానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనం గుండెల్లో సుస్థిర స్థానమే జగనన్న లక్ష్యం


బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పెద్దముడియం : జనం గుండెల్లో సుస్థిర స్థానం పొందడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, నాయకులతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ వాసులు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబద్దపు హామీలతో ప్రజలను మళ్లీ వంచిస్తున్న చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మరన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, సర్పంచ్ కటారు నిర్మల, వైస్ సర్పంచ్ బాపతి రమణారెడ్డి, ఎంపీటీసీ గుండు మల్లయ్య, పాలూరు నరసింహులు, వి.బాలచెన్నారెడ్డి, ఆలీబాబా, చాంద్‌బాషా, టి.రామసుబ్బారెడ్డి, ఎల్.శ్రీనువాసులరెడ్డి, వి.నారాయణ, ఎల్.రాఘవరెడ్డి, లోకేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, పి.శ్రీధర్‌రెడ్డి, బి.రమణారెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచండి

–డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి


టి.చదిపిరాళ్లలో పనులను పరిశీలిస్తున్న పీడీ యదుభూషణ్‌రెడ్డి

కమలాపురం : మండలంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని టి.చదిపిరాళ్లలో జరుగుతున్న అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను, పెద్దచెప్పలి, కొండాయపల్లెలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. దినసరి ఎంత మేరకు కూలీ డబ్బు పడుతోందని ఆరా తీశారు. అనంతరం ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. ముఖ్యంగా జాబ్ కార్డులేని వారికి జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. అడిగిన వారందరికీ పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. అలాగే రూ.272 కూలీ డబ్బులు పడే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట క్లస్టర్ ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ ఆఫీసర్ సాంబశివారెడ్డి, ఏపీఓ శైలజ, టీఏలు, ఎఫ్‌ఏలు ఉన్నారు.

బీటెక్ రవిని జిల్లా బహిష్కరణ చేయాలి

– వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : బీటెక్ రవి ప్రశాంత వాతావరణంలో ఉన్న చక్రాయపేట గ్రామాల్లో ఒక క్లియర్ ల్యాండ్ డాక్యుమెంట్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల పైకి సినీ ఫక్కీలో మందీ మార్బలంతో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని అతనిని జిల్లా బహిష్కరణ చేయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, వైఎస్సార్ సీపీ నాయకులు రసూల్, కోళ్ల భాస్కర్‌లు పేర్కొన్నారు. గురువారం పులివెందులలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రశాంతంగా ఉండే పులివెందులలో అరాచకాలు, అలజడులు సృష్టిస్తే ప్రజలే తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీటెక్ రవిని వారు హెచ్చరించారు. నిన్న రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు పెట్టామనడం ఎంతవరకు నిజం. నిజంగానే అధికార దుర్వినియోగానికి పాల్పడి ఉంటే ఈ కేసులో నువ్వు, మీ జిల్లా అధ్యక్షుడు వాసు ఇద్దరు కూడా బయట ఉండేవారా అని ప్రశ్నించారు. జగనన్న సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి కుటుంబం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కొనియాడుతున్నారన్నారు. టీడీపీ నాయకులందరూ తలకిందపెట్టి తపస్సు చేసినా పులివెందులలో డిపాజిట్ కూడా దక్కించుకోలేరన్నారు. మీరెన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలు గెలుస్తారని ఘంటా పథంగా చెబుతున్నామన్నారు. కార్యక్రమంలో అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సోపాల వీరా, సూరి, డేనియల్, చంద్రమౌళి, సంపత్, చలపతి, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు రంగనాయకులు, కొండల్రావు, తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యం మంజూరుపై హర్షం

కడప ఎడ్యుకేషన్: జనవరి 2022 కరువుభత్యం 2.73 శాతంను రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్లదారులకు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేయడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన జనవరి 2022 నుంచి 2023 జూన్ వరకు ఉన్న 16 నెలల బకాయిలను ఒకే విడతలో ఆగస్టు నెలలో చెల్లించాలన్నారు. అలాగే గత డీఏల బకాయిలను కూడా వెంటనే ఉపాధ్యాయుల ఖాతాలకు జమ అయ్యేటట్లు చూడాలని కోరారు.

గ్రామ వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండల పరిధిలోని లేబాక గ్రామ పంచాయతీలో ఖాళీగా వున్న గ్రామ వలంటీర్ పోస్టుకు అర్హత, ఆసక్తి వున్న అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లేబాక పంచాయతీలో ఓసీ (పురుషులు)– 1 ఖాళీగా వుందని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి 10 తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వుందని ఆమె తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 8వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

సమయం పాటించకపోతే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : మండల సమావేశానికి హాజర య్యే అధికారులు సమయపాలన పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పై ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. మూడు నెలలకొకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరు కావడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం మంచి పద్ధతికాదని ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తారన్న నమ్మకంతో మనందరిని ఎన్నుకోవడం జరిగిందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనులు చేయాలని ప్రజా ప్రతినిధులకు ఆయన సూచించారు. ఆర్టికల్చర్ అధికారి రెడ్డెయ్య మాట్లాడు తూ చీనీ, నిమ్మ పంట సాగులో నీటి యాజమాన్య పద్ధతిని ప్రతి రైతు తప్పని సరిగా పాటించాలని సాగు చేయు సమయంలో విత్తన శుద్ధి చేపట్టాలన్నా రు. గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో మందులు కొరత ఉన్నట్లు పలువురు ప్రజా ప్రతినిధులు సభా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన వైద్యాధికారి మహమ్మద్ తాహ మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రాల్లో మందుల కొరత ఉన్నమాట వాస్తవమేనని అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మందులను అందజేస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న ఇళ్లకు ఉచితంగా మీటర్లు అమర్చడం జరుగుతోందని లబ్ధిదారులు ఇంటి ఐడి నెంబరు, ఆధార్‌కార్డు తీసుకురావాలని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. తలపనూరు గ్రామంలో ఉపాధి హా మీ పనులు చేపట్టాలని ఏపీఓ వెంకటసుబ్బయ్యను పలుమార్లు కోరినా ఆయన స్పందించడంలేదని సర్పంచు శివమారుతిరెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మండల అభివృద్ధి అధికారి సోమవారం నుంచి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఉదయభారతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.